## కాంగ్రెస్‌ను నమ్మితే కరంటు కోసం చూడాలే..



ఖానాపురం: కాంగ్రెస్ పార్టీని నమ్మితే కరంటు కోసం ఎదురుచూడాలె. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాత్రీ పగలు పొలాల వద్దే పడిగాపులు కాసేవాళ్లం. వచ్చీరాని కరంటుతో నాలుగు మడులు కూడా తడిసేవి కావు. మళ్లీ కరంటు పోయేది. ఫీజులు పోయేవి, ట్రాన్స్‌ఫార్మర్లు ఖాళీపోయేవి. వాటిని మరమ్మతు చేయించడానికి రైతులమే చందాలు వేసుకునేవాళ్లం. అలాంటి రోజుల నుంచి కేసీఆర్ పుణ్యామా అని 24గంటల కరంటు చూస్తున్నాం. లోవోల్టేజీ సమస్య లేదు. ఎప్పుడు అవసరమనుకుంటే అప్పుడే కరంటు వాడుకుంటున్నాం. కాంగ్రెస్ నాయకులు 3గంటల కరంటు చాలంటున్నారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే మళ్లీ కరంటు గోసలు పడాల్సి వస్తుంది.

***- భూక్య చంద్రు, రైతు, నాజీతండా***

## ధరణి తీసేస్తే మళ్లీ లంచాలు షురువైతయి



ఖానాపురం: కాంగ్రెస్ నాయకులు ధరణి వద్దంటున్నరు. ధరణిని తీసేస్తే రెవెన్యూ శాఖలో మళ్లీ లంచాలు షురువైతయి. ధరణి రాకముందు భూముల రిజిస్ట్రేషన్ కోసం అధికారులకు ముడుపులు ముట్టజెప్పందే పని అయ్యేది కాదు. ధరణి వచ్చిన నాటి నుంచి రైతులకు పట్టాలు ఈజీగా అవుతున్నాయి. ఏ పైరవీకారుడు లేకుండా అరగంటలో అయిపోతున్నాయి. అలాంటి మేలు ధరణితోనే జరుగుతున్నది. కాంగ్రెస్ నాయకులు ధరణిపై అనుచితంగా మాట్లాడుతున్నారు. రైతులకు మంచి జరగడం కాంగ్రెస్ నాయకులకు ఇష్టం లేదు. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ రావాలని కాంగ్రెస్ కోరుకుంటున్నది. రైతులందరం కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి.

***- గుగులోత్ రాజు, రైతు, భద్రుతండా, ఖానాపురం మండలం***





చెన్నారావుపేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

## అమినాబాద్‌లో మహిళా పోలింగ్ స్టేషన్



అమినాబాద్‌లో ముస్తాబు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం

చెన్నారావుపేట, నవంబర్ 29: మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల్లో 31,273 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, అందులో 15,660 మంది స్త్రీలు, 15,612 మంది పురుషులు ఉన్నట్లు మండల ఎన్నికల అధికారి ఫణికుమార్ తెలిపారు. మండలంలో నలుగురు సెక్టార్ అధికారులు, 40 మంది పీవోలు, 40 ఏపీవోలు, 80 మంది ఓపీవోలు, ఇతర పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మహిళా ఓటర్లు ఎక్కువగా పాల్గొనాలని, అమినాబాద్‌లో మహిళా పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసినట్లు తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు సాయం చేసేందుకు ప్రభుత్వం పాఠశాల విద్యార్థులను వలంటీర్లుగా నియమించిందని పేర్కొన్నారు.

### నెక్కొండలో..

నెక్కొండ: మండలంలో పోలింగ్ కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సీఐ హథీరామ్, ఎస్సై జానీపాషా పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మండలంలోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లుగా గుర్తించిన నెక్కొండ, తోపనపల్లి, అలంకానిపేట, రెడ్లవాడ, చంద్రుగొండ, ముదిగొండ, నాగారంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద అదనపు బలగాలను మోహరించారు. మండలంలో 44,940 మంది ఓటర్లు ఉండగా 54 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.



నెక్కొండలో భద్రతాచర్యలను పరిశీలిస్తున్న సీఐ హథీరామ్, ఎస్సై జానీపాషా

## అయ్యప్ప ఆలయంలో మహాన్నదానం

నర్సంపేట, నవంబర్ 29: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో మహాన్నదానం చేశారు. ఆలయంలో 14వ రోజులు పూజోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అన్నదాతలుగా శింగిరికొండ వేణుగోపాల్ గుప్తా, మేర్గుస్వామి, మామిండ్ల రమేశ్, కటకం అజయ్, వాంకుడోతు రాజేందర్, అయిత సత్తయ్య, అజ్మీరా శంకర్ దాతలుగా వ్యవహరించారు. మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాంఈశ్వరయ్య, శ్రీరాముల శంకరయ్య, భూపతి రాజశేఖర్ పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు



నర్సంపేట మార్కెట్ యార్డు గోదాం ఆవరణలో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



నర్సంపేట: పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, ఏసీపీ తిరుమల్

# పోలింగ్‌కు రెడీ

- **నర్సంపేట మార్కెట్ యార్డులో సిబ్బందికి సామగ్రి అప్పగింత**
- **బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలింపు**

నర్సంపేట, నవంబర్ 29: నియోజకవర్గంలో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నర్సంపేట మార్కెట్ యార్డు గోదాం ఆవరణలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి అప్పగించారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలు, గుర్తులు, ఇంక్‌ను తదితర సామగ్రిని అప్పగించారు. సిబ్బంది ఉదయం నర్సంపేటలో రిపోర్ట్ చేశారు. వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన వారికి పీవో, ఏపీవోలుగా విధులు నిర్వర్తించనున్నారు. బస్సుల్లో పోలింగ్ సిబ్బంది రూట్ల వారీగా తరలి, కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. పోలింగ్‌కు అవసరమైన గుర్తులు, కాగితాలను అతికించారు. ఓటరుకు ఈవీఎం కనిపించేలా వెలుతురు ఉండేలా చేశారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పొద్దంతా ఉండి ఈవీఎంల పనితీరును చెక్ చేసుకున్నారు. ఈవీఎంలతోపాటు బ్యాటరీలు పనిచేస్తున్నాయా అని పరిశీలించుకున్నారు. కేంద్ర అబ్జర్వర్ షణ్ముక రాజన్, జానరల్ జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఏసీపీ తిరుమల్, ఆర్‌వో కృష్ణవేణి, సీఐ రవికుమార్ పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

### 41 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

నర్సంపేట నియోజకవర్గంలో 2,32,179 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,14,358, మహిళలు 1,17,815. ఇక్కడ 16 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పట్టణంలో మొత్తం 283 పోలిం గ్ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్ లోకేషన్లు 167 ఉన్నాయి. 31 సెక్టార్లలో 3 రిజర్వ్ ఉన్నాయి. రూట్స్ 33గా విభజించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను 41 గుర్తించారు. మైక్రోఅబ్జర్వర్లు 62మందిని నియమించారు. పీఓలను 325, ఏపీఓలను 325, ఓపీఓలను 650 మంది 1300 మంది అధికారులు పనిచేస్తున్నారు. అదనంగా 77మందిని నియమించారు. మోడల్ పోలింగ్ స్టేషన్లుగా 41 చలపర్తి, 102 బుధరావుపేట, 74 నల్లబెల్లి, 260 రెడ్లవాడ, 217 తిమ్మరాయిన్‌పహాడ్ ఉన్నాయి. మహిళా పోలింగ్‌స్టేషన్లు 12 దుగ్గొండి, 93 ఖానాపురం, 71 నల్లబెల్లి, 158 నర్సంపేట, 209 అమీనాబాద్ ఉనాయి. పీడబ్ల్యూడీ ఎంగేజ్డ్ పోలింగ్ స్టేషన్ 151 నర్సంపేట, యూత్ ఎంగేజ్డ్ పోలింగ్ స్టేషన్ నెక్కొండలుగా నిర్ణయించారు.



నర్సంపేట: పోలింగ్ సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది



ఖానాపురం: అశోకనగరకు వచ్చిన పోలీసులు



నర్సంపేట: బోర్డుపై పేర్లు చూసుకుంటున్న సిబ్బంది



నర్సంపేట రూరల్: కమ్మపల్లిలో వేసిన టెంటు

## నెక్కొండ మున్సిపాలిటీ, సివిల్ హాస్పిటల్ ప్రకటనపై హర్షం

- **ఇటీవల నెక్కొండలో పర్యటించిన మంత్రి హరీశ్‌రావు**
- **ఓటర్లలో సానుకూల స్పందన**

నెక్కొండ, నవంబర్ 29: మండలంలో ఇటీవల మంత్రి హరీశ్‌రావు పర్యటన తర్వాత పరిస్థితులు అంతా సానుకూలంగా మారాయి. మూడు రోజుల కింద మంత్రి హరీశ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఆతర్వాత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇక్కడే సుడిగాలిలా పర్యటించి ఇంటింటా ప్రచారం చేశారు. మార్పు కోసం రిస్క్ వద్దని, మండలంలో శరవేగంగా సాగుతున్న అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని మంత్రి సూటిగా ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే పెద్దిని మరోసారి గెలిపిస్తే నెక్కొండను నెలరోజుల్లో మున్సిపాలిటీని చేస్తామని ప్రకటించారు. ఇది పాజిటివ్ వేవ్‌కు కారణమైంది. రాష్ట్రంలో జిల్లా కేంద్రాల్లోనే మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తుంటే పెద్ది జిల్లా కేంద్రం కాని నర్సంపేటకు మెడికల్ కళాశాల తీసుకువచ్చారు. ఇది తన పని తీరుకు నిదర్శనమని ప్రజలు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే పెద్దికి అండగా నిలబడాలని చెప్పడం తటస్థ ఓటర్లను సైతం ఆలోచింపచేసింది. వ్యాపార, వాణిజ్య వర్గాలతోపాటు నెక్కొండ పట్టణ ఓటర్లలోనూ నెక్కొండ సిటీగా అవతరిస్తుంటే మనం ఎందుకు అండగా ఉండొద్దనే చర్చ నడుస్తోంది. నెక్కొండ పట్టణాన్ని సిటీ రూపురేఖలతో తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ ఏర్పాటు అవసరమని, అలాగే ఈ ప్రాంతంలో ఉన్న గిరిజన పేదలకు సివిల్ ఆస్పత్రి ఏర్పాటు అత్యంత ఆవశకమని, ఈ రెండు సాధించుకోవాలంటే బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడి పెద్ది ద్వారానే పనిచేయించుకోవచ్చని ఆ పార్టీ నాయకులు ఫుల్ జోష్‌తో ప్రచారం చేశారు. దీనికి సగటు ఓటర్ల నుంచి సానూకూలత వ్యక్తం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. దీంతో మండలంలో బీఆర్ఎస్‌కు భారీ ఆధిక్యత వస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.